రోడ్డుపై అడ్డంగా గేట్..!

- ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్ నిర్వాహకులు
- పక్కనే వివాదాస్పద ప్రభుత్వ భూమి
- ఇప్పటికే పలుమార్లు కబ్జాకు యత్నం



అక్రమ వెంచర్‌లో రోడ్డుపై ఏర్పాటు చేసిన గేట్

శంషాబాద్: వివాదాస్పదంగా మారిన సర్కారు భూమి పక్కనే కొందరు అక్రమార్కులు బరి తెగించారు. బయటి నుంచి ఎవరూ లోనికి రాకుండా భారీ గేట్ ఏర్పాటు చేశారు. పట్టణం లోని సర్వే నంబర్ 626 బై1లో ప్రభుత్వ రంగ సంస్థ అయిన హెచ్ఎండీఏకు సంబంధించిన స్థలం వెంచర్ నిర్వాహకుల పరిధిలో ఐదెకరాలు, ఇతరులు, వ్యవసాయ ఆక్రమణలో మొత్తం 14 ఎకరాలు ఉన్నట్లు 4 ఏళ్ల క్రితం రెవెన్యూ అధికారులు సర్వే చేసి రిపోర్టు సమర్పించారు. అయితే సంబంధిత భూములు తమవిగా పేర్కొంటూ కొంత భాగం కబ్జాలో ఉన్నవారు ఇప్పటికే పక్కనే ఉన్న భారీ వెంచర్ నిర్వాహకులకు కొంత అక్రమ పద్ధతిలో విక్రయించారు. హెచ్ఎండీఏ ఈ స్థలంపై పూర్తి స్థాయిలో పట్టు బిగించకపోవడంతో నాలుగేళ్లుగా ఇక్కడి భూములు పూర్తిగా వివాదాస్పదంగా మారాయి. సర్కారు భూమి పక్కనే అక్రమంగా చేసిన వెంచర్‌లో ఇండ్లు నిర్మించుకున్న సంపన్నులు, కొందరు రాజకీయ నేతలు ఏకంగా రోడ్డును మూసేందుకు గేట్‌ను సైతం ఏర్పాటు చేయడం స్థానికంగా చర్చనీయాశంగా మారింది.

గతేడాది సెప్టెంబర్‌లో రెవెన్యూ విభాగం తమ ఆధీనంలో తీసుకున్న భూమిపై కూడా వీరి కన్ను పడినట్లు తెలుస్తోంది. గేట్ ఏర్పాటుచేసి లోనికి దారి లేకుండా చేయడంతో వీరి వ్యవహారం కాస్తా మరింత సులువుగా మారుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిశీలించి తొలగిస్తాం..

రోడ్డుపై గేటు ఏర్పాటు చేసేందుకు వీల్లేదు. పరిశీలించి తొలగిస్తాం. పట్టణంలో వెంచర్‌కే అనుమతి లేదు. వారు గేటెడ్ కమ్యూనిటీ మాదిరిగా రోడ్డును మూసేందుకు ఎలాంటి అనుమతి లేదు. పట్టణ ప్రణాళికా విభాగంతో వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

చర్యలు తీసుకుంటాం..

రోడ్డును మూసేయడం చట్టవిరుద్ధం. అలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. వెంటనే సిబ్బందితో పరిశీలిన చేయిస్తాం. ప్రభుత్వ భూమిని సూచించే బోర్డులు తొలగించి ఎలాంటి కార్యక్రమాలకు పాల్పడిన చర్యలు తీసుకుంటాం.

– రవీందర్‌దత్, శంషాబాద్ తహసీల్దార్

సన్నాహక సమావేశం



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

బండ్లగూడ: రాష్ట్ర ప్రముఖ వాగ్గేయకారుడు ఉమ్మెంతల పీఠ వ్యవస్థాపకుడు రాకమర్ల వెంకటదాసు జీవితం వారి సంకీర్తనలపై తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో జనవరిలో నిర్వహించనున్న జాతీయ సదస్సు కోసం అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు తలారి ఆశీర్వాదం సారథ్యంలో పీరంచెరువు పాఠశాలలో ఆదివారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాచరణను రూపొందించారు. కార్యక్రమంలో అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకుడు దొరవేటి, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడు తుల్జారాంసింగ్‌ఠాకూర్, సాంస్కృతిక కార్యదర్శి పసుల హనుమంతు, ఉమ్మెంతల పీఠ ప్రతినిధులు శ్రీనివాసశర్మమ, బొబ్లాద్ రాఘవేంద్రాచార్యులు, అనంత సభ్యులు మజహరుల్లా అన్సారీ, సదీదుద్దీన్ అన్సారీ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

అత్తాపూర్: ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని జగ్గారెడ్డి గురుస్వామి పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి శబరిమలకు పాదయాత్రగా తరలివెళ్లిన అయ్యప్ప స్వాములు మహబూబ్‌నగర్ జిల్లా కొమ్మిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రగా వెళ్తూ సేవా కార్యక్రమాలను నిర్వహించడం అనవాయితీగా వస్తోందని ఇందులో భాగంగానే ఫ్యాన్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యంరెడ్డి గురుస్వామి, మాణిక్‌రెడ్డి, కేశవ గురుస్వామి, జగన్‌రెడ్డి గురుస్వామి, వెంకటేశ్ గురుస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కె.యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సిద్ధమవుతున్న దున్నపోతులు

నేడు సదర్ సమ్మేళనాలు

మణికొండ: దీపావళి పండగను పురస్కరించుకుని యాదవులు నిర్వహించే సదర్ వేడుకలకు నార్సింగి, కోకాపేట సిద్ధమయ్యాయి. నార్సింగి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, కోకాపేట గ్రామంలో సోమవారం రాత్రి 8 గంటలకు నిర్వహించే ఉత్సవాలకు వివిధ ప్రాంతాలకు చెందిన దున్నపోతులను రప్పించి వాటితో విన్యాసాలు చేయిస్తారు. వాటికి పూజలు నిర్వహించడంతో పాటు ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన వాటికి బహుమతులను అందజేస్తారు. యాదవులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యాదవ సంఘాల నాయకులు కోరారు. నార్సింగిలో ఉత్సవాలకు జాతీయ చాంపియన్‌ను 8 సార్లు సాధించిన దున్నపోతు పాల్గొంటుందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్ తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

కార్మికులకు దుస్తుల అందజేత



దుస్తులు, ఆర్థిక సాయం అందించిన బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తన కాలనీలో వాచ్‌మెన్లు, పని మనుషులు, మున్సిపల్ కార్మికులకు ఆర్థిక సాయంతో పాటు దుస్తులు అందించారు. నక్షత్ర గేటెడ్ కమ్యూనిటీలో జరిగిన కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు డి. సీతారాం, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ వి.బాల్‌రెడ్డి హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు కె. ధన్‌రాజ్, జి.నరేందర్, ఎ.లక్ష్మన్‌రావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి మాజీ ఎంపీపీ ఎల్లయ్య



ఎల్లయ్యకు కండువా కప్పుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య తన అనుచరులతో కలిసి ఆదివారం గులాబీ గూటికి చేరారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ మంత్రి పి.సబితారెడ్డి, రాజేంద్రనగర్ పార్టీ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దషాపూర్ మాజీ సర్పంచ్‌లు ఇస్రానాయక్, చంద్రశేఖర్, సొసైటీ డైరెక్టర్లు ప్రమోద్‌పటేల్, కె.నర్సింహ, మాజీ ఎంపీటీసీలు, గోపాల్‌నాయక్, గణేశ్, మాజీ ఉప సర్పంచ్‌లు నారాయణ, మహేశ్, సురేశ్ చేరారు.

నిత్యాన్నదానం ప్రారంభం



మణికొండ: పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరాలయ ఆవరణలో అయ్యప్ప స్వాములకు పుప్పాలగూడకు చెందిన కస్తూరి రాములు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు 500 నుంచి 2వేల మంది భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో తేజస్‌కు స్వర్ణం



జియాగూడ: అండర్–17 రైఫిల్ షూటింగ్ కమ్ సెలక్షన్ విభాగంలో జియాగూడకు చెందిన దర్పల్లి తేజస్ ప్రథమ స్థానంలో నిలిచాడు. హైదరాబాద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కన్వీనర్ విజయ్ శేఖర్, ఫిజికల్ డైరెక్టర్ అంబుజ్ పురానిక్‌ల చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నాడు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఇంటర్‌స్కూల్ డిస్ట్రిక్ట్ లెవెల్ రైఫిల్ షూటింగ్ పోటీలు నాంపల్లిలోని మదీనా పబ్లిక్ స్కూల్‌లో ఇటీవల జరిగాయి. కోచ్ అల్లూరి ప్రసన్న కుమార్, సెక్షన్ సెక్రెటరి జోసెఫ్ జోనాల్డ్, ఫిజికల్ డైరెక్టర్స్ జీవనజ్యోతి, రంజిత, కోచ్‌లు సయ్యద్ హుస్సేన్, సహస్ర శ్రీస్వామి తదితరులు పాల్గొన్నారు.